సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 23 । అక్టోబర్ । 2023

I



అపురూపం..
అమ్మవారి దివ్యరూపం
ప్రొద్దుటూరులో జరిగే నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించడం ఆనవాయితీ. -IIలో



శుభకార్యానికి వెళ్తూ..
శుభకార్యానికి వెళుతుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరో ఇద్దరు గాయడ్డారు. ఆదివారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.152
రెండోరకం	రూ.70	రూ.116



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 296 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	395	395
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 98.740 కిలోలు

న్యూస్‌రీల్

‘స్పందన’ తాత్కాలిక రద్దు

రాయచోటి: ఈనెల 23న (సోమవారం) జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. విజయదశమి సందర్భంగా సోమవారం సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

హార్సిలీహిల్స్‌పై కర్ణాటక సంయుక్త సీఈవో

బి.కొత్తకోట: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త సీఈవో వి.రాఘవేంద్ర ఆదివార ం రాత్రి హార్సిలీహిల్స్ చేరుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఆయన రాయచోటిలో ఈవీఎంల తనిఖీ, అధికారులతో సమావేశాల అనంతరం కొండకు చేరుకున్నారు. ఆయనకు తహసీల్దార్ రఫీక్ అహ్మద్, అధికారులు స్వాగతం పలికారు. గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. సోమవారం ఆయన తిరిగి వెళ్లనున్నారు.

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

రాయచోటి: దుర్గామాత మహిషాసురుని సంహరించి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి జిల్లా ప్రజలందరికీ ఆదివారం విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దసరా పండుగ జిల్లా ప్రజలందరికీ ధనం, ధ్యానం, ధైర్యం, అభయం, విజయం, ఆరోగ్యం, విద్య, సంతానం, సౌభాగ్యం, ఆయురారోగ్యాలను కలుగజేయాలని, అన్ని రంగాల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు.

‘సురక్ష’తో పేదలకు మెరుగైన వైద్యం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

నందలూరు (రాజంపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సీహెచ్‌సీ హెల్త్ బ్లాక్ నూతన భవనం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సృజన మాట్లాడుతూ పదకొండు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆరీఫ్ బాబు, ఎంపీహెచ్ఏ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పద్మజ



కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం 83 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు ఐసీడీఎస్ ఆర్‌జేడీగా పని చేస్తున్న పద్మజను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. పద్మజ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈమె అంతకుముందు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఐసీడీఎస్ పీడీగా పని చేశారు.

వైవీయూ ఆచార్యునికి చైనా ఆహ్వానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ ఆచార్యులు ఎం.వి.శంకర్‌కు చైనాలోని జియాంగ్సు యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన చైనాకు పయనమయ్యారు. ఈనెల 30వ తేదీ వరకు ఆయన చైనాలోని విశ్వవిద్యాలయంలోని అధికారులను కలుస్తారు. ఈ సందర్శన ముఖ్య ఉద్దేశం రెండు విద్యా సంస్థల మధ్య పరిశోధన, విద్యాపరమైన సహకారం గురించి చర్చించనున్నారు. చైనా ప్రభుత్వం నిధులు సమకూర్చే కొత్త ప్రాజెక్టును ప్రారంభించేందుకు చైనాలోని జియాంగ్సు యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆచార్యులు చావో యాన్‌తో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

దుష్ట సంహారిణి.. శిష్ట సంరక్షణి





ప్రొద్దుటూరు : అమ్మవారిశాలలో మహిషాసురమర్దినిగా వాసవిమాత, అమ్మవారిశాలలో భారీగా భక్తజనం



గుర్రంకొండ: రెడ్డెమ్మతల్లి దుర్గాదేవిగా దర్శనం

అయిగిరి నందిని, నందిత మేదిని,
విశ్వ వినోదిని నందనుతే
గిరి వర వింధ్య శిరోధిని వాసిని
విష్ణువిలాసిని జిష్ణునుతే
భగవతి హే శితికంఠకుటుమ్బిని
భూరికుటుంబిని భూరికృతే
జయ జయహే మహిషాసురమర్దిని
రమ్యకపర్దిని శైలసుతే!!'

అంటూ భక్తులు జగన్మాతను భక్తిశ్రద్ధలతో పూజించారు. దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన నవమి నాడు (ఆదివారం) అమ్మవారు ప్రముఖ ఆలయాల్లో మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేసి లోకం సుఖశాంతులతో ఉండేలా దీవెనలందిస్తుందని భక్తుల నమ్మకం. -సాక్షి, నెట్‌వర్క్



మదనపల్లె: మహిషాసురమర్దినిగా వాసవీ అమ్మవారు



ప్రొద్దుటూరు : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొమ్మల కొలువు



రాయచోటి: దుర్గాదేవిగా భద్రకాళీ అమ్మవారు

రారండోయ్.. వేడుక చూద్దాం..

- నేడు వైభవంగా శమీదర్శనం
- రాత్రి వాసవాంబ తొట్టిమెరవణి
- ఉత్సవాల్లో పాల్గొననున్న 2 లక్షల మందికిపైగా భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా ఉత్సవాలు నిర్వహించడంలో రెండో మైసూరుగా పుత్తడిపురం ప్రొద్దుటూరు ప్రసిద్ధి చెందింది. ఏటా లాగే ఈ ఏడాది దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అమ్మవారికి శమీదర్శన మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల్లో అమ్మవారి అలంకార రూపాలను దర్శించడం ఒక ఎత్తయితే.. శమీదర్శనంలో అన్ని ఆలయాల అమ్మవార్లను, దేవతా మూర్తులను ఒకే చోట దర్శించడం మరో ఎత్తు. అందుకే దసరా మహోత్సవాలలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నది శమీదర్శనం. అలాగే వాసవీ మాత తొట్టిమెరవణిని కనులపండువగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను దాదాపు 2 లక్షల మందికిపైగా భక్తులు తిలకిస్తారు. మధ్యాహ్నం 3.44 గంటలలోపు మకరలగ్నంలో వాసవీమాత శమీదర్శన మహోత్సవం ప్రారంభం కానుంది. పురవీధుల మీదుగా వైభవోపేతంగా అమ్మవారి శమీదర్శన మహోత్సవం ప్రారంభమై కొర్రపాడు రోడ్డులోని శ్రీవాసవీ శమీదర్శన మండపం చేరనుంది.

- విజయానికి, సంపదకు చిహ్నమైన శమీ వృక్షాన్ని దర్శించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని ప్రతీతి. అందువల్లనే విజయదశమి నాడు అమ్మవారికి శమీదర్శనం చేయించి తమకు విజయాలు, సిరిసంపదలు ఇవ్వాలని వేడుకుంటారు. శ్రీమహాలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి, శివాలయం, రాజరాజేశ్వరిదేవి, చౌడేశ్వరీదేవి, సత్యనారాయణస్వామి ఆలయాలతోపాటు పట్టణంలోని అన్ని ఆలయాల నిర్వాహకులు కొర్రపాడు రోడ్డు మిల్లులలోని శమీవృక్ష దర్శనానికి వివిధ కళాబృందాల మధ్య వైభవంగా చేరుకుంటారు. అన్ని ఆలయాల నుంచి వచ్చిన స్వామి, అమ్మవారి వైభవాన్ని తిలకించేదుకు వచ్చిన భక్తులతో కొర్రపాడు రోడ్డు భక్తసంద్రం కానుంది.



వాసవీ మాత మూలవిరాట్

విజయలక్ష్మీదేవి గ్రామోత్సవం

శ్రీవాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి గ్రామోత్సవం (తొట్టిమెరవణి) సోమవారం రాత్రి 11.24 గంటలలోపు మిథునలగ్నంలో ప్రారంభం కానుంది. పంచలోహంతో తయారు చేసిన తొట్టి మెరవణి రథంలో అమ్మవారి శ్రీ చక్రంను ఏర్పాటు చేశారు. ఈ రథం పర్యటించిన ప్రాంతంలో అశుభాలు, చెడులు తొలగిపోయి సర్వశుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో పురవీధులలో తొట్టిమెరవణిని నిర్వహిస్తారు. అమ్మవారిశాల నుంచి బయలుదేరి మెయిన్ బజారు, పప్పులబజారు మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంటుంది. కళ్లు మిరుమిట్లు గొలిపే చీరాల బాణసంచా పేలుళ్లు, వెలుగులతో ఆ ప్రాంతం నూతన శోభ సంతరించుకోనుంది. ఈ తొట్టి మెరవణిలో శమీదర్శనంలోని సన్నాయి మేళం, పాలకొల్లు బ్యాండు, కేరళ సింగారిమేళంతోపాటు సినీడూప్స్, డ్రమ్స్, కేరళ వారి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. ఉత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పరిపూర్ణం

- జిల్లాలో ఈక్రాప్, ఈకేవైసీ నూరు శాతం పూర్తి
- రైతులందరికీ రశీదులు అందజేత



గుర్రంకొండ సమీపంలో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

రాయచోటి: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వారి ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయి. ప్రతి పంచాయతీలో రైతుభరోసా కేంద్రాలను (ఆర్బీకే) ఏర్పాటు చేసి వ్యవసాయరంగాన్ని మరింత విస్తృతం చేస్తోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ సాగుకు సన్నద్ధమైన రైతులకు మద్దతుగా ఉండాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రాప్, ఈకేవైసీల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటలకు వ్యవసాయ శాఖ అధికారులు ఈ క్రాప్, ఈకేవైసీ బుకింగ్‌లో నూరు శాతం సాధించారు. జిల్లాలో 93412 మంది రైతులు 229697 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు సాగు చేశారు.రైతుల సహకారం, అధికారుల కృషి ఫలితంగా లక్ష్యాన్ని సాధించగలిగామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు.ఈ క్రాప్, ఈకేవైసీల బుకింగ్ పూర్తి కావడంతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. రైతులు పండించిన ప్రతీ పంట ఈ క్రాప్ బుకింగ్ చేసేందుకు వ్యవసాయ శాఖ తన పరిధిలోని ఆర్‌బీకేల్లోని సిబ్బందితో కలిసి కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వం కూడా ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచిస్తోంది. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు దీనినే ప్రామాణికంగా తీసుకోనుంది. సెప్టెంబర్ చివరి నాటికి 97 శాతం పూర్తి చేశారు. రెండు రోజుల కిందట ముగిసిన గడువు తేదీకి అన్నమయ్య జిల్లాలో 229697ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తయింది.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

- ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రభుత్వం రైతులను సిద్ధం చేస్తుంది. సెప్టెంబర్ నెలలో ఆశాజనకంగా వర్షాలు కురవడంతో రబీ సాగు లక్ష్యం దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

- ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. చాలా మంది పంటలు సాగు చేయకుండా రుణాలు పొందుతున్నారు. దీంతో నిజమైన రైతులు లబ్ధి పొందలేకపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఆన్‌లైన్‌లో వారు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు సాగు చేశారో గుర్తించి దాని ఆధారంగా వారికి రుణాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇకపై రైతు భరోసా పథకం కూడా ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా వేసేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. దీంతో నిజమైన రైతులకు లబ్ధి చేకూరే వీలు కలుగుతుంది.

ప్రయోజనాలివీ..

- ఈ క్రాఫ్ నమోదుతో బ్యాంకు ద్వారా పంట రుణాలు సులువుగా పొందే వెసులుబాటు కలుగుతుంది.
- వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకానికి అర్హత సాధించే వీలుంటుంది
- ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఉచితంగా పంటలబీమా పొందవచ్చు.
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు పరిహారం పొందొచ్చు.

పారదర్శకంగా సర్వే



జిల్లాలో ప్రస్తుతం సాగైన 229697 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తయింది. ఇందులో భాగంగా వ్యవసాయ సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి రైతు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నమోదులో పొరపాట్లకు తావు లేకుండా జియో ఫెన్సింగ్‌తో ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో ఫొటోలు తీస్తున్నారు. ఈ ఏడాది పంటకు సవరణ అవకాశం లేదు. పంటల నమోదులో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. – చంద్రనాయక్, జిల్లా వ్యవసాయాధికారి

మండలం	ఈ క్రాప్ నమోదు (ఎకరాల్లో)				
తంబళ్లపల్లి	12466	కెవి పల్లె	5877	కలకడ	4086
కోడూరు	9008	కురబలకోట	7525	లక్కిరెడ్డిపల్లి	6750
పెద్దమండెం	5440	టి.సుండుపల్లె	8277	రాజంపేట	6919
బి.కొత్తకోట	10107	రామసముద్రం	7055	మదనపల్లి	12498
రాయచోటి	6229	పీలేరు	9166	గుర్రంకొండ	6286
నిమ్మనపల్లి	5365	ములకలచెరువు	8028	నందలూరు	3834
చిన్నమండెం	7359	సంబేపల్లి	6422	పెద్దతిప్పసముద్రం	19101
కలికిరి	7034	చిట్వేలి	6162	వాయల్పాడు	7470
పెనగలూరు	5783	ఓబులవారిపల్లి	6408	గాలివీడు	10558
వీరబల్లి	9139	రామాపురం	5355	పుల్లంపేట	3992

జిల్లాలో ఆలయాల నిర్మాణానికి టీటీడీ రూ.6.10 కోట్లు

జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

రాజంపేట టౌన్: అన్నమయ్య జిల్లాలో అరవై ఒక్క ఆలయాల నిర్మాణానికి శ్రీవారి ట్రస్ట్ నిధుల నుంచి టీటీడీ రూ.6.10 కోట్లు మంజూరు చేసినట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. రాజంపేట, నందలూరు మండలాల్లో మొదటి, రెండవ విడతల్లో టీటీడీ ఆర్థిక సహాయంతో నిర్మితమవుతున్న దేవాలయాలను, మూడవ విడతలో ఆలయాల నిర్మాణానికి అవసరమయ్యే స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం విశ్వనాథ్ రాజంపేటలో విలేకరులతో మాట్లాడారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో టీటీడీ ద్వారా నిర్మితమయ్యే ఆలయాలను, స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల నిర్మాణాలకు సంబంధించిన పరిశీలిన పూర్తికాగానే నివేదికలను కమిషనర్‌కు పంపనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ప్రజలు ఆలయాలను నిర్మించుకోవాలనుకుంటే ఒక్కో ఆలయానికి టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఇందుకు గ్రామస్తులు ఒక బృందంగా ఏర్పడి స్థలం ఏర్పాటు చేసుకొని టీటీడీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే గ్రామస్తులే ఆలయాన్ని నిర్మించుకోవాలని




అత్తిరాలలో అభయకృష్ణ మందిరం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న విశ్వనాథ్ తదితరులు

అందుకు టీటీడీ విడతల వారీగా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. తొలుత ఆలయ నిర్మాణానికి బేస్‌మెంట్ వేసుకుంటే మొదటి విడత నిధులు మంజూరవుతాయని చెప్పారు. రూఫ్‌లెవల్ నిర్మాణం పూర్తికాగానే రెండో విడత నిధులు, విగ్రహ ప్రతిష్ఠ తర్వా మూడో విడత నిధులు మంజూరవుతాయని ఆయన తెలిపారు.

- టీటీడీ ద్వారా విగ్రహాలు కావాలనుకునే వారు దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీతో విగ్రహాలను కూడా తిరుమల-తిరుపతి దేవస్థానం మంజూరు చేస్తుందని తెలిపారు. జిల్లాలో టీటీడీ ఆధ్వర్యంలో మూడటి, రెండవ విడతల్లో 105 ఆలయాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇంజినీర్లు రవితేజ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మూడో విడతలో మంజూరైన ఆలయాల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన ఆలయాలు
రాజంపేట	27
రైల్వేకోడూరు	16
రాయచోటి	13
పీలేరు	03
మదనపల్లె	02
మొత్తం	61



నూతన నియామకం


ముత్ర దామోదర్ రెడ్డి

కురబలకోట: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ముత్ర దామోదర్ రెడ్డి నియమితులయ్యారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పాటుపడతానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి


ఖలీల్

బి.కొత్తకోట : గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా రెండోసారి నియమితుడైన పాగొండ ఖలీల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్టీ కార్యవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తనను జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించడంతో బాధ్యత పెరిగిందన్నారు. తన నియామకానికి కృషిచేసిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు.

అపురూపం.. అమ్మవారి దివ్యరూపం

- దేవీనవరాత్రుల్లో దేదీప్యమానంగా అలంకారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : సిరిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణం దసరా వేడుకలను నిర్వహించడంలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించింది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున చేరుకుంటారు. దసరా వేడుకల్లో పూజలతోపాటు అమ్మవారి అలంకారానికి ప్రత్యేకత ఉంది. నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించడం ఆనవాయితీ. అమ్మవారి రూపాలైన రాజరాజేశ్వరీదేవి, భవానిదేవి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సరస్వతీ, అన్నపూర్ణ, బిల్వవృక్షవాసినీ పార్వతీదేవి, మహిషాసుర మర్దిని, విజయలక్ష్మి, గజలక్ష్మి, శారదాదేవి వంటి దేవతామూర్తుల అవతారాల్లో అమ్మవారిని తీర్చిదిద్ది భక్తులకు కనుల విందు చేయడం దసరా ఉత్సవాల ప్రత్యేకత. అమ్మవారి ఉత్సవమూర్తికి అందంగా చీరకట్టడం మొదలు ఒక్కో అవతారానికి సంబంధించిన హస్తాలు, పాదాలు, మరుకం, పాశాంకుశాలు, అభయహస్తం, ఖడ్గం వంటి ఆయుధాలు, వాహనం, పక్షులు, ఆభరణాలతో అమ్మవారిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతారు. చామంతి, గుండుమల్లె, రోజా, పన్నీరు ఆకు, రకరకాల గులాబీమాల, తోమాల, గజమాల, సంపంగి మాలలతో అలంకరణ పూర్తయ్యేసరికి దాదాపు 3 నుంచి 5 గంటల సమయం పడుతుంది. మహిషాసురమర్దిని అలంకారానికి మరింత సమయం పడుతుంది. ఉత్సవ విగ్రహాన్ని వివిధ అమ్మవారి రూపాల్లో అలంకరించే నైపుణ్యం వీరి సొంతం. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో తమిళనాడు వేలూరుకు చెందిన సోముగురుకుల్ అమ్మవారి అలంకారాలను చేయడం తోపాటు పుష్పాలంకరణ చేస్తున్నారు. అమ్మవారిశాల, మహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి, శివాలయం, రాజరాజేశ్వరిదేవి, చౌడేశ్వరిదేవి తదితర ఆలయాల దసరా ఉత్సవ కమిటీవారు కర్ణాటక, తమిళనాడు, విజయవాడ, ప్రాంతాల కళాకారులతో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తున్నారు.


రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అలంకరిస్తున్న దృశ్యం


పూల దండలు కడుతున్న దృశ్యం

దసరా వేడుకల్లో అమ్మవారిని అలంకరిస్తున్నా



దేవీ శరన్నవరాత్రి సందర్భంగా ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తున్నాను. అమ్మవారికి చీరకట్టి, అభయ హస్తాలు, పాదుకలు, ఆయుధాలు, పూల అలంకరణ, చీరెలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు అధిక సమయం పడుతుంది. 18 ఏళ్లగా దసరా ఉత్సవాల్లో అమ్మవారిని అలంకరిస్తున్నాను.

- సోము గురుకుల్, వేలూరు

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె: కర్ణాటక నుంచి టాటా సుమోలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి, 20 బాక్సుల మద్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఈబీ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు పట్టణ శివారు ప్రాంతం అమ్మచెరువుమిట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, టాటాసుమోలో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటుగా మద్యం అక్రమ రవాణాలో ప్రధాన సూత్రధారి, అంగళ్లు సమీపంలోని డాబా నిర్వాహకుడైన సూర్యచంద్రారెడ్డి అలియాస్ డాబాసూరి(45), అతడి అనుచరుడైన నరేష్(42), కర్ణాటకకు చెందిన సుమో డ్రైవర్ బాలాకుమార్(30)లను అరెస్టు చేశామన్నారు. వీరు ముగ్గురితో పాటు ప్రధాన నిందితుడైన డాబాసూరికి సహకరిస్తున్న కర్ణాటకకు చెందిన మరొక వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

నగల చోరీపై కేసు నమోదు

మదనపల్లె : ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన నగల చోరీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీఆర్ లేఅవుట్‌కు చెందిన మహేష్‌బాబు స్థానికంగా ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈయన భార్య సి.ఝాన్సీలక్ష్మీ దసరా పండుగ సందర్భంగా పిల్లలతో కలిసి సొంత ఊరైన గాలివీడుకు వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంది. బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు చాకచక్యంగా ఆమె బ్యాగులోని నగలను చోరీ చేశారు. సొంత ఊరు వెళుతున్న కారణంగా ఇంట్లోని 130 గ్రాముల నగలను తన వెంట తీసుకువెళుతుండగా చోరీ జరిగినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నగల విలువ సుమారు రూ.3.90లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి


మృతుడు నాగిరెడ్డి

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం గట్టు సమీపం తొట్లివారిపల్లెకు చెందిన టి.నాగిరెడ్డి (65) అనే రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా.. శనివారం రాత్రి ఏడు గంటలకు ఇంటినుంచి వెళ్లిన నాగిరెడ్డి ఇంటికి తిరిగి రాలేదు. సాధారణంగా ఇంటినుంచి వెళ్లే నాగిరెడ్డి ఒక్కోసారి ఆలస్యంగా వచ్చేవాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లినా తిరిగి వస్తాడని భావించారు. అయితే ఆదివారం సాయంత్రం అతను తొట్లివారిపల్లెకు సమీపంలోని కాల్వకింద శవమై పడి ఉండగా గ్రామస్తుడు విశ్వనాథరెడ్డి గమనించి మృతుని కొడుకు నరసింహారెడ్డికి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు తొట్లివారిపల్లెకు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుని కాళ్లు, చేతులు కట్టేసిన గుర్తులు ఉన్నట్టు గుర్తించారు. ముక్కు, మొహంపైనా గాయాలున్నాయి. మృతుని కుమారుడు నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో పెళ్లైన ఏడాదికే వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. మోతీనగర్‌కు చెందిన ఇంతియాజ్, జుబేరియా(22) ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అంతలోనే వీరిమధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె ఆదివారం విషద్రావణం తాగింది. గమనించిన కుటుం బసభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని తిరుపతికి తీసుకెళ్లారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల గ్రామంలో ఆదివారం పురుగుల మందు తాగి బి.వెంకటమ్మ (49) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెంకటమ్మ కుమారుడు సుబ్బరాయుడు ఏడాది క్రితం మలేషియాలో మృతి చెందాడు. ఒక్కగానొక కుమారుడు మృతి చెందడంతో మనస్తాపానికి గురైన వెంకటమ్మ శనివారం ఇంటివద్ద పురుగుల మందు తాగింది. ఆమెను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త సుబ్రమణ్యం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

- బైక్‌పై వెళ్తున్న దంపతులను ఢీకొన్న కారు
- భర్త దుర్మరణం, అపస్మారక స్థితిలో భార్య
- పల్టీకొట్టిన కారు, ఒకరికి గాయాలు


మృతి చెందిన అన్నయ్య


అపస్మారక స్థితిలో మధు


గాయపడిన రాజేష్

బి.కొత్తకోట : బి.కొత్తకోట నుంచి మదనపల్లె వైపు బైక్‌పై భార్యాభర్తలు, మదనపల్లె నుంచి బి.కొత్తకోట వైపు కారులో భార్యాభర్తలు శుభకార్యాల కోసం బయ లుదేరారు. వీరు గమ్యస్థానాలకు చేరుకోక ముందే మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన భార్యాభర్తలు వి.అన్నయ్య (45), మధు (40)లు బి.కొత్తకోటలో స్థిరపడి స్థానిక పీటీఎం రోడ్డులో పానీపూరి బండి నడుపుకొంటూ జీవిస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము మూడు గంటలకు స్వగ్రామం ఎర్రమద్దువారిపల్లెలో వివాహ వేడుక ఉండటతో బైక్‌పై బయలుదేరారు. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన జగదీష్ (26) పీలేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన భార్య వాణితో కలిసి బి.కొత్తకోటలో జరిగే వివాహ వేడుక కోసం కారులో బి.కొత్తకోటకు బయలుదేరారు. బైక్, కారు మండలంలోని మొగసాలమర్రి బస్టాప్ వద్దకు రాగానే కారు అదుపుతప్పింది. కుడివైపు దూసుకొస్తూ బైక్‌ను ఢీకొంది. బైక్‌ను కారు కొద్ది దూరం లాక్కెళ్లింది. తర్వాత కారు పల్టీకొటి బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వి.అన్నయ్య అక్కడికక్కడే దుర్మణం చెందాడు. భార్య మధు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కారులోని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, మరికొందరు కాపాడేందుకు ప్రయత్నించారు. కారులోని రాజేష్, వాణీలను బయటకు తీసి 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీఐ శివాంజనేయులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్నయ్య మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వివాహ వేడుకల కోసం వెళ్తున్న భార్యాభర్తలు ప్రమాదాలకు గురికావడం, వారిలో ఒకరు మృత్యువాత పడటంతో విషాదం నెలకొంది.


పల్టీకొట్టి ధ్వంసమైన కారు



బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు : మండలంలోని జ్యోతి కాలనీ వద్ద ఆదివారం బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో యామల సుబ్రమణ్యం(36) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు రైల్వేకోడూరు మండలం చియ్యవరం వడ్డిపల్లెకు చెందిన సుబ్రమణ్యం తన మ్యాక్స్ వాహనం జ్యోతికాలని వద్ద మరమ్మతుకు గురి కావడంతో కోడూరు నుంచి బైక్‌లో బయలుదేరాడు. జ్యోతికాలని సమీపంలోకి రాగానే చెన్నై వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన సుబ్రమణ్యం

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

- జిల్లాలో మొదటి సభ ప్రొద్దుటూరులోనే
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 28న సాయంత్రం ప్రొద్దుటూరులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు సంబంధించి మొదటి సభను ప్రొద్దుటూరులోనే నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం పార్టీ నేతలు స్థానిక వైవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుంటారని తెలిపారు. సాయంత్రం రామేశ్వరం, వన్‌టౌన్ సర్కిల్, విజయకుమార్ థియేటర్, రాజీవ్ సర్కిల్ మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు ర్యాలీ ఉంటుందని వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదవులు ఇచ్చి వారి గౌరవాన్ని వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ నిలబెట్టిందన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నదేనన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక సాధికారతలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవులు మొదలు, ఆలయ పాలకమండళ్లతో సహా అన్ని చోట్ల బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించిందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని వర్గాలకు పదవులు కట్టబెట్టిన ప్రభుత్వం తమదేనని తెలిపారు. బస్సు యాత్రకు సినీనటుడు ఆలీ, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు హాజరవుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, రాజుపాళెం మండల వైస్ ఎంపీపీ ఎస్ఏ నారాయణరెడ్డి, ఏపీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పస్నీటి కాశయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, చేనేత విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, కౌన్సిలర్ రాగుల శాంతితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, కాకర్ల నాగేషారెడ్డి, మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం బాలాజీ నగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సయ్యద్ నుజహత్ నఫీసాను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో అలసత్వం వహించడంతో పాటు విద్యార్థినులతో పాఠ్యాంశాలకు సంబంధం లేని అంశాలను చర్చించడం, బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆ పాఠశాలల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, మదనపల్లె ఆర్డీఓ అధ్యక్షతన త్రీమెన్ కమిటీ నియమించి నివేదికను కోరారు. ఈ విషయమై త్రీమెన్ కమిటీ విచారణ జరిపి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించింది. వారి నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ ఈమేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఓబులేసు మృతదేహం

లింగాల : లింగాల మండలం పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోని వంకలో అనంతపురం జిల్లా ఎల్లుట్ల గ్రామానికి చెందిన ఓబులేసు (50) అనే వ్యక్తి మద్యంలో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితమే అతను మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. ఘటనా స్థలంలోనే పోసుమార్టం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దివారిపల్లెకు చెందిన వై.కిరణ్‌కుమార్‌రెడ్డి(26) ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతూ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల ఆత్మహత్య


రవిశంకర్ ఆచారి, సరస్వతమ్మ (ఫైల్)

చెన్నూరు : కుటుంబ కలహాలతో దంపతులు కొర్రపాటి రవిశంకర్ ఆచారి(52) ఆయన భార్య సరస్వతమ్మ శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రూకవారిపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రపాటి రవిశంకర్ ఆచారి, సరస్వతమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇందులో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. కాగా పెద్దమ్మాయి ప్రేమ వివాహం చేసుకోవడంతో కుటుంబంలో మన స్పర్థలు ఏర్పడ్డాయి. అయితే కొద్ది రోజులకు పెద్దమ్మాయి కుటుంబంతో కలిసిపోయినప్పటికీ మనస్పర్థలు తొలగలేదు. అప్పటికే చిన్న కుమార్తె అయిన లిఖితేశ్వరి అమెరికా వెళ్లి చదువుకుంటానని తల్లిదండ్రులకు చెప్పగా వారు ఒప్పుకోకపోవడంతో, తన అక్కతో ఈ విషయాన్ని చెప్పి ఆమె ప్రోత్సాహంతో లా'చదువుల కోసం అమెరికాకు వెళ్లింది. పెద్ద కుమారుడు విక్రమ్ ఆదిత్య ఆచారి గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేస్తూ బచ్చుంపల్లెకు చెందిన ఒక అమ్మాయిని నాలుగు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు, ఈ క్రమంలో రవిశంకర్ ఆచారి, చిన్న కుమారుడు వినయ్ ఆనంద్ ఆచారి వృత్తి రీత్యా బంగారు అంగడికి వెళ్లగా, సరస్వతమ్మ తన ఇంటిలో ఒక్కటే ఉండింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10:30 గంటలకు ఇంట్లో ఉండే విషద్రావణాన్ని తాగింది. మంట తాళ లేక గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఆమెను కడపలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య మరణ వార్త విన్న భర్త తాను పనిచేస్తున్న అంగడి వద్దకు వెళ్లి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి, భార్యాభర్తల మృత దేహాలను చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.